క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం



నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గెంజి సురేష్ దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి కూడలిలోని రుణ విమోచన గణపతి ఆలయ అభివృద్ధికి వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గెంజి సురేష్ దంపతులు రూ.పదివేల నగదు బుధవారం ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడుకు అందించారు. సురేష్ మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న తన దృష్టికి టైల్స్ ఏర్పాటు చేసేందుకు సహకారం అందివ్వాలని కోరడంతో రూ.10 వేలు అందించానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మడక రమేష్‌నాయుడు, కొప్పాక బాబూరావు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల అందజేత



సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్ నుంచి వాటర్ బాటిళ్లు అందుకుంటున్న ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఉద్యోగ, కార్మికులకు సావనీర్ గిఫ్ట్‌గా వాటర్ బాటిళ్లు అందజేశారు. గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ పరిపాలనా భవనంలో భెల్ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్ చేతుల మీదుగా ఉద్యోగ, కార్మికులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, ఎ.వెంకటరావు, ఖలీల్, డి.మోహనదాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గాజువాక: బీజేపీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్రియాశీలక నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సిరసపల్లి నూకరాజు, బొండా ఎల్లాజీరావు, గూటూరు శంకరరావు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 24 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మొత్తం రూ.2,30,000 జరిమానా విధించారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపిన వివరాలు.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 24 మందిని 3వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 2వ క్లాస్ కోర్టు జడ్జి మురళీ కృష్ణ ముందు హాజరుపర్చగా 23 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వీరిలో ఎ.చిన్నారావు అనే వ్యక్తికి 4 రోజుల జైలు శిక్ష విధించినట్టు చెప్పారు.

పదోన్నతులు కల్పించాలి



ఎమ్మెల్యే పల్లాకు వినతి అందజేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల బంగార్రాజు కోరారు. బుధవారం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గాజువాకలో కలిసి వినతిపత్రం అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలని, అధిక పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విశాఖ జిల్లా నాయకులు అనిల్, ప్రకాష్, డి.శివ, అలీ మొహిద్దీన్, చందు తదితరులు ఉన్నారు.

ఆ 2 గంటలూ.. నిరీక్షణే..!



సాధారణ రిజర్వేషన్ టికెట్ల క్యూలో ప్రయాణికులు



దువ్వాడ రైల్వేస్టేషన్

ఆ రెండు గంటలు సాధారణ రిజర్వేషన్ కౌంటర్ పనిచేయదు. ఉదయం పది నుంచి 12 గంటల వరకు ప్రతీ రోజూ తత్కాల్ రిజర్వేషన్ కోసం సాధారణ రిజర్వేషన్లను నిలిపివేస్తున్నారు. రెండు గంటల పాటు దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో పడిగాపులు కాయాల్సిరావడంపై ప్రయాణికులు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. – అగనంపూడి

తత్కాల్ రిజర్వేషన్ సమయంలో సాధారణ రిజర్వేషన్‌కు బ్రేక్

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పెరగని సిబ్బంది, రిజర్వేషన్ కౌంటర్లు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

పా గ్రామిక ప్రాంత ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్పెషల్ రైళ్లు మినహా దాదాపు అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు నిలుపుదల చేస్తున్నారు. ఇక్కడ నుంచి ప్రయాణికుల రద్దీ కూడా పెరిగింది. అయితే ఒకే రిజర్వేషన్ కౌంటర్ ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. తత్కాల్ రిజర్వేషన్ కౌంటర్ పనిచేసే సమయంలో సాధారణ రిజర్వేషన్ సేవలు నిలిపి వేయడంతో రిజర్వేషన్ కోసం వచ్చేవారికి తిప్పలు తప్పడం లేదు.

ప్రచారంలోనే అభివృద్ధి

విశాఖ రైల్వే స్టేషన్‌కు సమాంతరంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతామని అధికారులు ప్రకటిస్తున్నా ఆచరణలో మాత్రం కానరావడం లేదు. ఆదాయపరంగా చూస్తే తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో దువ్వాడ రైల్వేస్టేషన్ రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంది. సౌకర్యాల కల్పనలో మాత్రం అధికారులు నత్తకు నడకలు నేర్పుతున్నారు. వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల సంఖ్య, ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని వసతులు కల్పించడంలో అధికారులు కనీస శ్రద్ధ చూపడంలేదు. రైల్వేస్టేషన్ అభివృద్ధి అంటూ హంగులు, ఆర్భాటాలు చేస్తున్న పాలకులు, ఉన్నతాధికారులు కనీస వసతుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

పట్టని ప్రయాణికుల గోడు

నాలుగో ప్లాట్‌ఫారం వైపు రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రజా సంఘాల నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయమై రైల్వే ఉన్నతాధికారులకు తూర్పు కోస్తా రైల్వే జోనల్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ పలుమార్లు లేఖలు రాశారు. అయినా ప్రయోజనం లేదు. నాలుగో నంబర్ ప్లాట్ ఫారం వైపు అయితే పార్కింగ్ ప్రదేశం దగ్గరగా ఉండడంతోపాటు గాజువాక, సబ్బవరం శివారు గ్రామాలకు చెందిన ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఈశ్వర్ లేఖల్లో పేర్కొన్నారు.

ఇదీ పరిస్థితి

ఒకటో నంబర్‌ప్లాట్ ఫారం వైపు కేవలం ఒక రిజర్వేషన్ కౌంటర్ మాత్రమే ఏర్పాటు చేశారు. తత్కాల్ రైల్వే టికెట్లు జారీ చేసే సమయం ఉదయం 10 నుంచి 12 వరకుసాధారణ రిజర్వేషన్లు(స్లీపర్, థర్డ్ ఏసీ, సెకెండ్ ఏసీ, ఫస్ట్‌క్లాస్ ఏసీ) చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఈ రెండు గంటలు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల రిజర్వేషన్ కోసం వచ్చిన వారంతా ఎక్కడ ఉండాలనేది భేతాళ ప్రశ్నగా మారింది.



ముగ్గురు మాత్రమే వేచి ఉండడానికి ఏర్పాటు చేసిన కుర్చీలు

కౌంటర్ వద్ద మూడు కుర్చీలు మినహా ఎటువంటి వసతి లేకపోవడంతో రిజర్వేషన్ కోసం వచ్చే వారు ముప్పతిప్పలు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



పెరుగుతున్న ప్రయాణికులు, ఆదాయాన్ని అనుసరించి దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సిబ్బందిని రెట్టింపు చేసి అదనంగా రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు వినతుల ద్వారా విన్నవించాం. విజ్ఞప్తులను కనీసం పరిగణలోకి తీసుకోవడం లేదు. విశాఖ ఎంపీ, పాలకులు ఈ విషయంలో చొరవ తీసుకొని దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– కాటం చంద్రరావు, అధ్యక్షుడు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్

రిజర్వేషన్ కౌంటర్ ఆవశ్యకతను గుర్తించాలి



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు సబ్బవరం, గాజువాక మండలాల శివారు 20 గ్రామాల వరకు ఉన్నాయి. ఈ ప్రాంతీయులకు అందుబాటులో నాలుగోనంబర్ ప్లాట్‌ఫారం ఉంది. ముఖద్వారం వద్దే కౌంటర్ ఉండడం వల్ల వృద్ధులు, వికలాంగులు కూడా రిజర్వేషన్ చేసుకొనేందుకు వీలుగా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులకు వినతులు పంపించాం. అయినా స్పందించడం లేదు.

– కె.వీర్రాజు, భరత్‌నగర్

చలో విజయవాడకు తరలిన మున్సిపల్ కార్మికులు



సంతకాలు చేస్తున్న కార్మికులు

గాజువాక: తమ డిమాండ్ల సాధన కోసం సేకరించిన సంతకాల ప్రతులను మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు సమర్పించడం కోసం మున్సిపల్ కార్మికులు విజయవాడ బయల్దేరారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గాజువాక జోన్ నుంచి కార్మికులు భారీ సంఖ్యలో చలో విజయవాడకు తరలివెళ్లారు. ఆప్కాస్‌ను రద్దు చేసి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, అనారోగ్యం పాలైన కార్మికుల బదులు పని చేస్తున్నవారి పేర్లు మార్చాలని, రిటైర్మెంట్, డెత్ పోస్టులు భర్తీ చేయాలని, 2023–24నాటి సమ్మె ఒప్పందాలకు సంబంధించిన జీవోలను అమలు చేయలనే డిమాండ్లపై కార్మికులు సంతకాల సేకరణ నిర్వహించారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 11న అయ్యప్పస్వామి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని బుధవారం షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను సేవా సంఘం ప్రతినిధులు నంబారు రాజు, చరపాక నాగార్జున రాజు, బొడ్డు చినఅప్పలస్వామి, నంబారు రమణ, జక్క కొండలరావు, తుమ్మలచర్ల భద్రాచలం, మరడాన శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విజేతలకు 11న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ కొత్తపాలెం గ్రామదేవత దుర్గమాంబ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు లేమర్తి, అగ్రహారం, పి.బోనంగి, కొత్తపాలెం, ఇ.బోనంగి, ఎదురువానిపాలెం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి సన్యాసిరావు, సతీష్, దాసరి నీలకంఠం, పితాన నీలకంఠరావు, కండేపల్లి శంకరరావు, చిన్నారావు, గోపి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'సర్వహిత' బాసట

అగనంపూడి: సేవ చేయాలనే గుణం ఉంటే చాలు.. ప్రాంతంతో పనిలేదని నిరూపించుకున్నారు సర్వహిత చారిటబుల ట్రస్ట్ ప్రతినిధులు. వాట్సప్‌లో వచ్చిన వీడియో చూసి చలించిన అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నక్కపల్లి మండలం దొడ్డిగల్లు వెళ్లి బాధితుడికి రూ.పదివేల నగదు, నెలకు సరిపడా బియ్యం, ఇతర రేషన్ సరకులు అందించి వచ్చారు. వివరాల్లోకి వెళ్తే... అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగ శ్రీను (28) కొబ్బరి చెట్లు ఎక్కి కొబ్బరి కాయలు దించే పని చేస్తుంటాడు. రెండు మాసాల కిందట శ్రీను కొబ్బరి చెట్టు ఎక్కుతూ కాలుజారి కిందపడిపోవడంతో వెన్నుపూస విరిగిపోయి మంచానికే పరిమితమయ్యాడు. పూరిపాకలో జీవనం సాగిస్తున్న వీరికి వేరే ఆధారం లేకపోవడంతో వాట్సప్ ద్వారా సహాయాన్ని అర్థించారు. వీడియో చూసి చలించిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామఅప్పారావు, చైర్మన్ మస్తాన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి లక్కరాజు రాము దొడ్డిగల్లు వెళ్లి రూ.పదివేల నగదు, నిత్యావసర సరకులు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.



మంచాన పడిన శ్రీను కుటుంబానికి నగదు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్, నోవస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టింపనీ ఫీడర్ పరిధిలో ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, వుడా ఫేజ్–2 ఏరియా అమరావతి నగర్, భరత్‌నగర్ ఏరియా, నోవాస్ ఫీడర్ పరిధిలో నోవాస్ అపార్ట్‌మెంట్లు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే విగ్రహావిష్కరణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఓబీసీల ఆరాధ్య దైవం జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలు ఆవిష్కరించనున్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా ఓబీసి అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో ఉదయం 7.30 గంటలకు విగ్రహావిష్కరణ చేయనున్నారు. స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ ఎ.కె. సక్సేనా , డైరెక్టర్లు సలీం పురుషోత్తమన్, ఎస్.సి. పాండే, ఎ.కె. బాగ్చీ, గణేష్, జి.వి.ఎస్. ప్రసాద్, సీజీఎంలు ఆర్. మహంతి, జి. గాంధీ, జీఎంలు పి.ఎస్.రావు, ఎం. మధుసూదనరావు, వై. చంద్రశేఖర్ హాజరు కానున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు బి. అప్పారావు తెలిపారు.

ఉక్కు స్థలాల పరిరక్షణలో దోబూచులాట!

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు స్థలాలను కాపాడడంలో అధికారులు దోబూచులాట ఆడుతున్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. తమపై చర్యలు తీసుకొనే దమ్ము ఎవరికి ఉందంటూ ఛాలెంజ్ చేస్తున్నారు. దర్జాగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి : వడ్లపూడి తదితర నిర్వాసిత కాలనీల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు అప్పట్లో కేటాయించారు. అయితే ఆర్‌కార్డుల్లో తేడాలు ఇతరత్రా కారణాలతో దాదాపు 300 మందికి కేటాయించిన స్థలాలు రద్దు చేసి ఉక్కు భూసేకరణ విభాగం తమ ఆధీనంలోనే ఉంచుకుంది. అయితే ఆ స్థలాలపై ఇప్పుడు రాజకీయ పార్టీ నాయకులు, దళారులు, భూకబ్జాదారులు కన్నేసి ఒక్కొక్కటిగా చేజిక్కించుకుంటున్నారు. వాటిని ఆక్రమించి భవంతులు నిర్మించేస్తున్నారు. అయినా వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. దీనిలో భాగంగానే పవన్‌సాయి ఆస్పత్రి వెనుక స్టీల్ ప్లాంట్ స్థలంలో జరుగుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకోవడానికి తాత్సారం చేస్తున్నారు. ఉక్కు అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించి దర్జాగా నిర్మాణం చేస్తున్నా సూత్రధారులు ఎవరో తెలియడం లేదని అధికారులు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది.



మీటరు తొలగిస్తామని అక్రమంగా నిర్మించిన బిల్డింగ్‌కు నోటీసు అంటిస్తున్న జేఈ

ఆయన కనబడితే నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు భవనాలకు విద్యుత్ మీటర్లు తొలగించాలని ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరో అక్రమార్కుడు నోటీసు తీసుకోవడానికి నిరాకరించడంతో గోడలకు అతికించి ఫొటోలు దిగి పని అయిందనిపించారు. అక్రమార్కుల వెనుక అధికార పార్టీ నాయకులు ఉండడం వల్లే యంత్రాంగం నాన్చుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కోట్లాది రూపాయల విలువ చేసే ఉక్కు స్థలాలు కబ్జాదారుల పరం కావడం ఖాయం.

కదలని మురుగు..

ఎక్కడ చెత్త అక్కడే



వినాయకనగర్ ఆదర్శగ్రౌండ్ ప్రధాన గెడ్డలో వ్యర్థాలు

పెదగంట్యాడ: మండలంలోని కాలువలు, గెడ్డలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగు కంపు కొడుతున్నాయి. నెలలు తరబడి మురుగు నిలిచిపోవడంతో చుట్టపక్కల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని నడుపూరు, వుడాకాలనీ, నెల్లిముక్కు, సీతానగరం ఇలా పలు ప్రాంతాల్లో గెడ్డలు ఉన్నాయి. గతంలో ఎప్పటికప్పుడు మురుగు పారే విధంగా చర్యలు తీసుకునేవారు. కానీ కొద్ది నెలలుగా నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. శానిటరీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఎక్కడ?

ఒక వైపు జీవీఎంసీ అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో హడావుడి చేస్తున్నారు. ప్రకటనలు గుప్పిస్తున్నారు. రోడ్ల పైనే చెత్తాచెదారం దర్శనం ఇస్తున్నా కనీసం వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా వికాసానికి చోటేది?

మైదానంలో ఆవుల తిష్ట

అక్కిరెడ్డిపాలెం: వేసవి సెలవులు అంటే విద్యార్థుల్లో ప్రత్యేక ఉత్సాహం వస్తుంది. ఎండను సైతం లెక్క చేయకుండా ఆటలకు ఉపక్రమిస్తుంటారు. ఎక్కడ చిన్న మైదానం కనిపించినా చాలు బ్యాట్లు, వికెట్లు పట్టుకుని క్రికెట్‌కు రెడీ అయిపోతారు.

అయితే జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ఎదురుగా గల దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల ఆలయ మైదానంలో ఆవులు తిష్ట వేయడంతో పిల్లలు ఆడుకోవడానికి చోటు లేకుండా పోయింది. రాత్రి అయితే మూగజీవాలు చేరి విశ్రాంతి తీసుకుంటాయి. వేకువజామున వీటి యజమానులు పాలకోసం తీసుకువెళ్తారు. రాత్రి సమయంలో మలమూత్రాలతో మైదానం అంతా అస్తవ్యస్తం చేస్తున్నాయి. విద్యార్థులు ప్రస్తుతం మలమూత్రాల మధ్యనే ఆటలాడుతూ ఇబ్బందులకు గురవుతున్నారు.



మైదానంలో ఆవుల మలమూత్రాల మధ్య ఆడుకుంటున్న విద్యార్థులు

బిక్కు బిక్కు

వేసవి సెలవులు వచ్చాయంటే ఈ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు బిక్కుబిక్కు మంటుంటారు. కారణం సరైన ఆట స్థలం కరువుతో భెల్‌లో మైదానానికి వెళ్తుంటారు. వీరు అక్కడికి వెళ్లాలంటే జాతీయ రహదారి దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. మరి కొంతమంది విద్యార్థులు ఇంట్లో చెప్పకుండా నరవ దగ్గరలో ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనవుతుంటారు. దీనికి కారణం గ్రామంలో సరైన మైదానం , పార్కు లేకపోవడమేనని ఆరోపిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఖాళీగా ఉన్న స్థలాన్ని మైదానంలా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మూగజీవాలు, ప్రైవేటు అవసరాలకు కాకుండా కనీసం ప్రహరీ నిర్మించాలని విన్నవిస్తున్నారు.



రాత్రి సమయంలో మైదానంలో సేదతీరుతున్న ఆవులు